క్లుప్తంగా

షాద్‌నగర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

షాద్‌నగర్: భారీ వర్షాల నేపథ్యంలో షాద్‌నగర్ మున్సిపాలిటీలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వెంకన్న తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అత్యవసర సేవలకు గాను ఖాజా ఇలియాస్ – 7331105319, జావీద్ – 6303969848, సాయిబాబా – 9110792423, శివశంకర్ – 9985196105, మల్లేష్ – 8074812872, దశరథ్ – 7658999056 ఫోన్ నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

స్థానికులకే అవకాశం కల్పించాలి

కేశంపేట: మహిళ శిశు సంక్షేమశాఖ, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో స్థానికులకే అవకాశం కల్పించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. గతంలో మండలాల్లో చైల్డ్‌లైన్‌లో 9 సంవత్సరాలుగా తమ సేవలను అందించామని వారు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పని చేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా కలెక్టరెట్‌లో పని చేస్తున్న అధికారులు వారి బంధువుల కోసం స్థానికేతరులను ఔట్‌సోర్సింగ్ విధానంలో ఎంపిక చేశారని ఆరోపించారు. ఇదే విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ స్పందించి స్థానికులకే అవకాశం కల్పించాలని కోరారు.

రజినికి శుభాకాంక్షలు


రజినికి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్‌పర్సన్ సాయిచంద్ అకాల మరణం తరువాత ఆయన సతీమణి వేద రజినిని గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆమె గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రజినిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ

మొయినాబాద్ రూరల్: ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇవ్వడంపై వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ చైర్మన్ డాక్టర్ గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండంలోని హిమాయత్‌నగర్‌లో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన డాక్టర్ గంగాధర్, ఆర్ఎంపీ డాక్టర్ల రాష్ట్ర అధ్యక్షుడు బాలబ్రహ్మాచారిలు మాట్లాడారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో అతిత్వరలోనే ఆర్ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులందరూ మండలంలో యూనియన్‌లో తమ పేర్లను నమోదు చేసుకొని శిక్షణకు సిద్ధం కావాలన్నా రు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు డాక్టర్ సతీష్‌కుమార్, రాంచందర్, జగన్, ఎం.ప్రభాకర్, మహిపాల్, ఆర్.నరేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎల్లంపల్లిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్, ఎస్సీ సెల్ కమిటీలను ఎన్నుకున్నారు. బీసీ సెల్ నూతన కమిటీ అధ్యక్షుడిగా ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివకుమార్, ఉపాధ్యక్షుడిగా సూర్య, శేఖర్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కార్యదర్శిగా రాఘవేందర్, కోశాధికారిగా భూపాల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వేణుగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివకుమార్, ఉపాధ్యక్షుడిగా బాలచందర్, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, కార్యదర్శిగా జగన్, కోశాధికారిగా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లక్ష్మారెడ్డి కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న కేఎల్ఆర్

చేవెళ్ల: కేఎల్ఆర్ కంపెనీ ఉద్యోగి యాల లక్ష్మారెడ్డి జూన్ 13న అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందించారు. లక్ష్మారెడ్డి ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తానని, అనంతరం కేఎల్ఆర్ కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, చేవెళ్ల నియోజకవర్గం నాయకులు భీంభరత్, షాబాద్ దర్శన్, చేవెళ్ల సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకటరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్: వర్షం నీటిని కాల్వల ద్వారా మళ్లిస్తున్న సిబ్బంది


షాద్‌నగర్: రోడ్డుపై ప్రమాద సూచిక ఏర్పాటు చేసిన అధికారులు


వర్షంలో గొడుగు పట్టుకుని బైక్‌పై వెళ్తున్న వాహనదారులు

ఎడతెరిపిలేని వర్షం

తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు

అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపిలేకుండా వర్షాలు దంచికొడుతున్నాయి. గురువారం రోజంతా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆఫీసులకు, ఇతర పనులకు వెళ్లేవారు వర్షంలో తడుస్తూ వెళ్లాల్సిన పరిస్థితి. చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడి పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్


షాబాద్: ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు


మొయినాబాద్‌లో జలమయమైన రోడ్డు


శంకర్‌పల్లి: రిత్విక్ వెంచర్ రోడ్డులో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి


షాద్‌నగర్: ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకన్న


షాద్‌నగర్: వాగులో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కాపాడిన గ్రామస్తులు


మొయినాబాద్‌రూరల్: గొడుగు పట్టుకొని వెళ్తున్న చిన్నారులు

అంతిరెడ్డిగూడ పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

నందిగామ: మండల కేంద్రం నందిగామ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామాలైన జంగోనిగూడ, అంతిరెడ్డిగూడలకు సంబంధించి జంగోనిగూడతో కూడిన అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీకి ఎన్నికలు నిర్వహించే ప్రక్రియకు సుప్రీంకోర్టు ఆదేశాలతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు గురువారం డీపీఓ నుంచి ఎంపీడీఓకు ఆదేశాలు జారీ అయ్యాయి. 22న అన్ని రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించాలని, 22నుంచి 24 వరకు ఏమైన అభ్యంతరాలుంటే స్వీకరించి, 25న అభ్యంతరాలను నివృత్తి చేయడం, 26న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

అంధకారంలో నక్కలపల్లి

మొయినాబాద్‌రూరల్: మండలంలోని నక్కలపల్లిలో మూడు రోజుల నుంచి కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సర్పంచ్ స్వప్న , బీజేపీ నేత జంగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నిరంజన్‌గౌడ్‌లు మాట్లాడుతూ.. విద్యుత్ అధికారులకు మూడు రోజుల నుంచి కరెంటు సరఫరా నిలిచిపోయిందని తెలిపిన సమస్య పరిష్కరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నక్కలపల్లి గ్రామానికి కేతిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. గతంలో వేసిన విద్యుత్ స్తంభాలు ఉండడం వల్లనే ఈ సమస్య ఏర్పడుతుందని వారు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కరెంటు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్తంభాలు విరిగిపడ్డాయి: ఏఈ హామునాయక్

గత మూడు రోజులుగా కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు రెండు చోట్ల విరిగిపడ్డాయన్నారు. భారీగా వర్షం కురుస్తుండడంతో స్తంభాల ఏర్పాటు ఇబ్బందిగా మారిందని వివరించారు.

నూతన నియామకం

షాద్‌నగర్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన అందె మోహన్ ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సురభి దివేది ఉత్తర్వులు జారీ చేశారు. అందెమోహన్ మా ట్లాడుతూ.. యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీ నేతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని చించోడ్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రుస్తుం రాములు ఇటీవల మృతి చెందాడు. దీంతో బీఆర్ఎస్ పార్టీ చేయించిన బీమా ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును మృతుడి భార్య మాధవికి గురువారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి బలమని అన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఆలోచించి కార్యకర్తలకు బీమా చేయించడం జరిగిందని చెప్పారు. కార్యకర్తలు ఏకారణం చేతనైనా మరణిస్తే బీమా డబ్బులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఖాజా ఇద్రీస్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం


శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, తదితరులు

ఎంపీపీ రవీందర్ యాదవ్

కేశంపేట: బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక నిధులను మంజూరు చేసి అభివృద్ధికి దోహదపడుతుందని ఎంపీపీ ఎల్లనమోని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని సంతాపూర్‌లో రెండు లక్షలతో అండర్ డ్రైనేజీ నిర్మాణాలకు, కొత్తపేటలో రూ.20 లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, ఎక్లాస్‌ఖాన్‌పేటలో కోటి యాభై ఆరు లక్షల వ్యయంతో పాఠశాల భవన నిర్మాణాలకు ఎంపీపీ రవీందర్ యాదవ్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వివక్షకు గురైందని ఆరోపించారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయించుకొని గ్రామాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కొత్తపేట సర్పంచ్ నవీన్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, మల్లేష్‌యాదవ్, నరేష్‌యాదవ్, అల్వాల శ్రీను, యాదగిరిరావు, నారాయణరెడ్డి, సాజిద్, వెంకటయ్య, మురళీమోహన్ పాల్గొన్నారు.

‘డబుల్’ పై ప్రశ్నిస్తే భయమెందుకు ?

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీపై ప్రశ్నిస్తే ప్రభుత్వానికి భయమెందుకని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం ఇబ్రహీంపట్నంలో పోరుబాట కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయలేదని ఆరోపించారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో పోలీసుల పహారాలో పరిపాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని అన్నారు.


షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు

అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు

షాద్‌నగర్: నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇవ్వాలని ప్రశ్నిస్తే బీజేపీ నేతలను అరెస్టు చేయడం సరికాదని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, డాక్టర్ విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నాయకులు బాట సింగారం వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారు జామునే పోలీసులు నేతల ఇళ్లకు వెళ్లి వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ఆరోపించారు. మోసపూరిత హామీలు ఇచ్చి పేదలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నందిగామ పీఎస్‌లో

నందిగామ: డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలన కోసం వెళ్తున్న బీజేపీ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు లక్ష్మన్ గౌడ్, అరవింద్,మల్లేష్, వెంకటేష్, అశోక్,ప్రవీణ్ ఉన్నారు. అలాగే, శంషాబాద్ టోల్‌గేట్ వద్ద ఆందోళన చేస్తున్న మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడు హుస్సేన్ నాయక్, రాష్ట్ర నాయకులు బుక్క వేణుగోపాల్‌ను నందిగామ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కేశంపేటలో..

కేశంపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు బాటాసింగారంలోని డబుల్ బెడ్రూం ఇండ్ల పరిశీలనకు వెళ్తున్న మండల బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, నరేందర్‌రెడ్డి, మహేష్, శివాజీ తదితరులను పోలీసులు అరెస్టు చేసి సొంత పూచీకత్తులపై విడుదల చేశారు.


షాబాద్: పోలీసుల అదుపులో బీజేపీ నేతలు

పేదల పక్షాన ఉద్యమాలు చేస్తాం

షాబాద్: బీజేపీ పార్టీ పేదల పక్షాన పోరాటం చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల సందర్శనకు వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్ని అరెస్టులు చేసిన పేద ప్రజల కోసం పోరాటం చేస్తామని చెప్పారు. అరెస్టు అయిన వారిలో బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, ఉపాధ్యక్షుడు సురేష్‌గౌడ్, నాయకులు రమేష్, శివ, శ్రీకాంత్, రామకృష్ణలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

నిబంధనలు పాటిస్తే అభ్యంతరం లేదు

క్రషర్‌ప్లాంట్ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు


ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న సర్పంచులు

కొత్తూరు: ప్రజాభిప్రాయ సేకరణలో క్రషర్ ప్లాంట్ నిర్వాహకులు చెప్పిన విధంగా నిబంధనలు పాటిస్తే ప్లాంట్ ఏర్పాటుకు తమకు ఏలాంటి అభ్యంతరం లేదని ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు అధికారులకు తమ అభిప్రాయాలను తెలిపారు. సిద్దాపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 361లో స్టోన్ క్రషర్ ఏర్పాటుకు అధికారులు గురువారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. హాజరైన సమీప గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమ తమ అభిప్రాయాలను తెలపగా అధికారులు వీడియో రికార్డు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో 90 శాతం మంది ప్రజలు గతంలో ఓ స్టోన్ క్రషర్ లీజును పొడిగించొద్దని చెప్పినా ఎందుకు అనుమతులు జారీ చేశారో సమాధానం చెప్పాలని అధికారులను నిలదీశారు. దీంతో పీసీబీ ఈఈ సంగీత, ఆర్డీఓ వెంకటమాధవరావు అనుమతులు ఇచ్చే కమిటీ వేరుగా ఉంటుందని ప్రస్తుతం తాము కేవలం ప్రజల అభిప్రాయాలను రికార్డు చేసి కమిటీకి అందజేస్తామని వివరించారు. దీంతో స్థానికులు ఇప్పటికే ఏర్పాటు చేసిన క్రషర్ ప్లాంట్ల నిర్వాహకులు చేసే బ్లాస్టింగ్‌ల ధాటికి వ్యవసాయ బోర్లు లోపల కూరుకుపోవడంతో పాటు పంటలపై దుమ్ము పడి దిగుబడి తగ్గుతుందని అధికారులకు విన్నవించారు. అంతేకాకుండా బ్లాస్టింగ్‌ల కారణంగా సమీపంలోని ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని వివరించారు. ఈ సమస్యలను అధికారులు పరిష్కరించని పక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. కొత్తగా క్రషర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్న నిర్వాహకులు మాత్రం కచ్చితంగా నిబంధనలు పాటించే విధంగా అధికారులు ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు ప్రభాకర్, అజయ్‌నాయక్, వెంకట్‌రెడ్డి, సంతోష్‌నాయక్, నాయకులు శేఖర్‌రెడ్డి, ఖాజా, బాలయ్య, కృష్ణయ్య, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ నిర్వీర్యం

మహేష్ అంబేడ్కర్ సేన జిల్లా అధ్యక్షుడు

షాద్‌నగర్‌రూరల్: సీఎం కేసీఆర్ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమయిందని అంబేడ్కర్ సేన జిల్లా అధ్యక్షుడు మహేష్ గురువారం పేర్కొన్నారు. సమాన విద్యకోసం జరిగే పోరాటంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు భాగస్వాములు కావాలని అన్నారు. పెండింగ్ ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సమస్యలపై ఆగ్రహం

- భగీరథ నీటి సరఫరాలో అలసత్వం
- సర్వసభ్య సమావేశంలో సర్పంచుల అసహనం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాబాద్: అధికారులపై తీరు ఆయాల గ్రామాల సర్పంచులు మండిపడ్డారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు తమ సమస్యలను సభ ముందుంచారు. ముందుగా వ్యవసాయశాఖ అంశంపై ఏఓ వెంకటేశం మాట్లాడారు. సకాలంలో రైతులకు రైతుబంధు, రైతుబీమా పథకాలు అందుతున్నాయని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు, రోడ్లు గుంతలమయంగా మారాయని పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఏట్ల ఎర్రవల్లి, తిర్మలాపూర్, రేగడిదోస్వాడ, కుమ్మరిగూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఏఈ నరేందర్ 15 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. తిర్మలాపూర్ గ్రామానికి మిషన్ భగీరథ వాటర్ సక్రమంగా రావడం లేదని సర్పంచ్ శ్రీధర్ రెడ్డి అధికారులపై మండిపడ్డారు. అధికారులు వెంటనే తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ ప్రశాంతిరెడ్డి సూచించారు. అప్పారెడ్డిగూడ, పోలారం గ్రామాలకు వర్షాకాలంలో రేషన్ సరుకులు తీసుకురావడానికి ఇబ్బంది ఉందని తమ గ్రామాలకు వచ్చి రేషన్ పంపిణీ చేయాలని సర్పంచ్ పూజిత, ఎంపీటీసీ జముకమ్మ సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించి డిప్యూటీ తహసీల్దార్ మధు రేషన్ సరుకులు గ్రామాల్లో సరఫరా అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల రోడ్లకు కోట్ల రూపాయాల నిధులు మంజూరయ్యాయని టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, ఏఈలు శ్రీదివ్య, నరేందర్, శారద, వైద్యులు వరలక్ష్మి, శ్రీనివాస్, ఏఓ వెంకటేశం, ఏపీఎం నర్సింహులు, ఎంఈఓ శంకర్‌రాథోడ్, ఏపీఓ వీరాసింగ్, తదితరులున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి


వంటగదిని పరిశీలిస్తున్న డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: ప్రతివిద్యార్థిని వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఆరోగ్యం, పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థినులకు వివరించారు. అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు ప్రతి రోజు స్నానం చేసి ఉతికిన బట్టలను కట్టుకోవాలన్నారు. భోజనానికి, మలవిసర్జన తరువాత చేతులను సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. నులి పురుగుల వ్యాధి బారిన పడకుండా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని తెలిపారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారిణి అరుణ, డాక్టర్ సంధ్య, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఏఎన్ఎం పుష్పలత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.